క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన ఉద్యమ నాయకులు



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమ నాయకులు

తుర్కయంజాల్: ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడానికి తోడ్పాటును అందించాలని ఉద్యమ నాయకులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, బచ్చిగళ్ల రమేష్, తూళ్ల నర్సింహ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆమనగల్లు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రినాలిసా, తపస్యలు ఎంపికయ్యారు. ఈ నెల 25న జాతీయ స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీని నిర్వహించగా.. అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో చిన్నారులను శనివారం ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు శంకర్, అంజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

మాడ్గుల: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్ కుమార్ రైతులకు సూచించారు. శనివారం మండల పరిధి అప్పారెడ్డి పల్లి గ్రామంలో పశువులకు టీకా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 5,341 పశువులకు టీకా వేశామని తెలిపారు. పశు సంపద రోగాల బారిన పడకుండా ముందస్తుగా టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్, మండల పశువైద్య అధికారి డాక్టర్ శ్రీకర్ రెడ్డి, శంకర్ యాదవ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మండల ప్రత్యేకాధికారి ముత్యాలు



కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఎస్సీ వసతి గృహాలను ఆయన ఎంపీడీఓ శ్రీకాంత్‌తో కలిసి తనిఖీ చేశారు. వంటగది, ఆహార పదార్థాలు, కూరగాయలు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్, స్టడీ రూం, విద్యార్థులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి, చిన్నారులకు పాఠాలు బోధించాలని సూచించారు. ఎంపీఓ రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వృత్తిదారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం

మీర్‌పేట: మీర్‌పేట పోస్టాఫీసు సమీపంలోని శివశంకర్‌నగర్‌లో ఆదివారం విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకోజు యాదగిరిచారి ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, సంఘాల నాయకులు లెల్లెల బాలకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

పల్లెల్లో ఫాం హౌస్ కల్చర్!

ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఫాం హౌస్‌లు.. క్రమంగా పల్లెల్లోకి చొరబడుతున్నాయి. పచ్చని పొలాలతో కళకళలాడుతున్న మారుమూల ప్రాంతాల్లో కొలువుదీరుతున్నాయి. అందమైన కొండలు, గుట్టలు, లోయలను ఆసరాగా చేసుకొని విదేశీ సంస్కృతిని పరిచయం చేస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు చిరునామాగా మారి.. పల్లె సంస్కృతిని కలుషితం చేస్తున్నాయి.

పెరుగుతున్న వ్యవసాయ క్షేత్రాలు

- చుట్టూ ప్రహరీ.. పచ్చికబయళ్ల మధ్య వెలుస్తున్న అద్దాల మేడలు
- పార్టీలకు అనుకూలంగా హాళ్లు
- సరదాగా గడపడానికి పార్కులు, ఈతకొలన్లు
- వీకెండ్‌లో నగర యువత సందడి



ఆరుట్ల రెవెన్యూపరిధిలో గుట్టల మధ్య అందమైన ఫాం హౌస్

మంచాల: మండల పరిధిలో నాడు అరకొరగా ఉన్న ఫాం హౌస్‌లు.. గడిచిన ఐదేళ్ల కాలంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండటంతో, బడా వ్యాపారులు కొందరు.. కారుచౌకగా శివారులోని వ్యవసాయ, ఇతర భూములను కొనుగోలు చేస్తున్నారు. తొలుత చుట్టూ భారీ ఎత్తున ప్రహరీ నిర్మిస్తున్నారు. అనంతరం లోపల చిన్నపెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. గ్రీనరీతో కూడిన పార్కులు, ఈత కొలన్లు, పిల్లలకు ఆటవస్తులు ఏర్పాటు చేసి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. రాత్రి పూట ఈవెంట్లు, ఫంక్షన్లు చేసుకునే విధంగా హాళ్ల నిర్మాణం, ఫొటో షూట్‌కు అనుకూలమైన పూలతోటలు, భారీ సెట్టింగులు ఏర్పాటు చేసి, మాయా ప్రపంచాన్ని తలపించేలా కనువిందు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరుట్ల రెవెన్యూ పరిధిలో పదికి పైగా ఫాంహౌస్‌లు వెలిశాయి. ఆగాపల్లి రెవెన్యూ పరిధిలో నాలుగు, నోముల పరిధిలో మూడు, కాగజ్‌ఘట్‌లో నాలుగు ఇలా మండలంలో 20కి పైగా ఉన్నాయి. ఇవి కాకుండా వ్యక్తిగత వ్యవసాయ క్షేత్రాల్లో గదులు నిర్మించి, తగిన వసతులు కల్పించి అద్దెకు ఇస్తున్నారు.



రాత్రి పూట ఉండడానికి వీలుగా గుట్టల మధ్య అన్ని సదుపాయాలతో ఫాం హౌస్

సెలవు రోజులు వస్తే చాలు..

సెలవు దినాల్లో సెద తీరడానికి సకుటుంబ సమేతంగా వ్యవసాయ క్షేత్రాలకు వెళితే ఒక రకంగా, విడిగా వెళితే మరో విధంగా నిర్వాహకులు అద్దె వసూలు చేస్తున్నారు. వినియోగించుకున్న విధానాన్ని బట్టి రెండు వేల నుంచి రూ.2 లక్షల వరకు తీసుకుంటారు. కొన్ని చోట్ల ఎకరా, అర ఎకరా స్థలంలో గార్డెన్‌తో కూడిన భవనాలు నిర్మించి, అద్దె రూపేనా రోజుకు రూ.10 వేల నుంచి 15 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. వీకెండ్‌లో నగరాల నుంచి యువతీ యువకులు పెద్ద ఎత్తున ఫాం హౌస్‌లకు తరలివస్తుంటారు. శని, ఆదివారాలు ఎంజాయ్ చేస్తుంటారు. ఈ క్రమంలో యువత మద్యం మత్తులో హంగామా చేస్తుంటారు. బైకులు, కార్లలో గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతుంటారు. క్రమంగా వీరి చేష్టలు శృతి మించుతుండటంతో.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి.

అభివృద్ధి పేరుతో..



గ్రామాల్లో అభివృద్ధి పేరుతో ఫాంహౌస్‌ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. ఫంక్షన్ల పేరిట యువతీ యువకులు మద్యం సేవిస్తున్నారు. విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పల్లె వాతావరణం దెబ్బతింటుంది. సంబంధిత అధికారులు, పోలీసులు ఫాంహౌస్‌లపై నిఘా పెట్టాలి.

– జంగయ్య గౌడ్, ఆరుట్ల

చట్టబద్ధంగా ఉండాలి



గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టబద్ధంగా ఉండాలి. అనుమతులు తీసుకోవాలి. వ్యవసాయ పొలాల్లో ఫాంహౌస్‌ల పేరుతో విచ్చల విడిగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేస్తాం.

– ఎ.బాల శంకర్, ఎంపీడీఓ, మంచాల



తుర్కయంజాల్: ఉద్యమ నేతల వర్ధంతిలో సీపీఎం నాయకులు



ఇబ్రహీంపట్నం: పాష, నరహరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

పాష, నరహరిల వర్ధంతిలో సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: పేదల కోసం నిరంతరం పోరాడిన పాష, నరహరిలు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామేల్ అన్నారు. మహబూబ్ పాష, నరహరిల వర్ధంతిని ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా వారు పోరాడారని, వెట్టి చాకిరి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి ఉద్యమం చేశారని గుర్తుచేశారు. అమరుల ఉద్యమస్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని స్పష్టంచేశారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ జంగయ్య, ఎల్లేశ్, జగన్, బుగ్గరాములు, నర్సింహ్మా, వెంకటేశ్, శంకర్, మునలయ్య, వీరేషం, స్వప్న, ఉన్నీష, యాదగిరి, భిక్షపతి, దాసు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో ..

తుర్కయంజాల్: అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ అన్నారు. శనివారం మహబూబ్ పాషా, నరహరిల 35వ వర్ధంతిని పురస్కరించుకుని రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, ఆశీర్వాదం, శంకరయ్య, కృష్ణ, మధు, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: సీపీఎం పార్టీ దివంగత నేతలు, పోరాట యోధులు మహబూబ్ పాషా, నరిహరిల వర్ధంతి సభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధి నక్కర్తమేడిపల్లి, చింతపట్ల, కొత్తపల్లి గ్రామాల్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తలకొండపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ధర్నా చేశారు. ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్ ఇవ్వని కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బోధనా రుసుం చెల్లించక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఫీజు చెల్లిస్తేనే పత్రాలు ఇస్తామనడంతో.. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనర్హులుగా మిగులుతున్నారని వెల్లడించారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, వెంకటేశ్, మల్లేశ్, భరత్, నందు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

తలకొండపల్లి: సీసీ కెమెరాల ఏర్పాటుకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆయన అందజేసిన నగదును స్థానిక నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీకాంత్‌కు అందజేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట పడనుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా.. బాధ్యులను గుర్తించేందుకు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని, తద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఆంజనేయులు, సింగిల్‌విండో డైరెక్టర్లు యాదయ్య, శేఖర్, మల్లేశ్, శ్రీను, కోటేశ్వర్, పాండు, సత్తయ్య, మహేశ్, శ్రీరాములు, రవి, దీప్లా, కర్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐకి విరాళం అందజేస్తున్న నాయకులు

కార్యకర్తకు పరామర్శ



శివలింగను పరామర్శిస్తున్న ఆచారి

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం అజిలాపురంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ కార్యకర్త శివలింగంను, శనివారం బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

బడంగ్‌పేట్: బడంగ్‌పేటకు చెందిన వై.శారద హిందీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం శారద ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల మున్సిపాలిటీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇందు వశిష్ఠకే కావ్యమే సంవేదన ఔర్ షిల్ప్ అనే అంశంపై డాక్టర్ విజయ్‌కుమార్ జాదవ్ పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేయగా.. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం నుంచి డాక్టరేట్‌ను ప్రకటించిందని శారద తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సహచర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఆమెకు అభినందనలు తెలిపారు. పరిశోధనకు పూర్తి సహకారం అందించిన వారికి శారద ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: అభివృద్ధి పనుల్లో పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. 6వ వార్డులో కౌన్సిలర్ రాజేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ కృష్ణారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధి ప్రతి వీధిలో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రఘు ముదిరాజ్, దాసరి నర్సింగ్‌రావు, సంజీవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న పార్టీ నాయకులు

యాచారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్య యాదవ్ సూచించారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి, చింతుల్ల, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల్లో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి గుంతపల్లి గ్రామంలో అవంతి విద్యాసంస్థల ఆవరణలో శనివారం అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)ను నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో.. చేపట్టిన కార్యక్రమంలో కోసూకల్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు తుమ్మల నాగప్రసాద్.. 'రోల్ ఆఫ్ ఏ టీచర్/ఎడ్యుకేటర్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ' అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ ఎంవీఎస్ఎస్ నందీష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, ఎండీ శ్రావన్‌కుమార్, డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రామచందర్‌రావు, వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యాధికారికి వీడ్కోలు

ఇబ్రహీంపట్నం రూరల్: మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డికి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. మరో ప్రాంతానికి బదిలీ అయిన సందర్భంగా.. వెంకట్‌రెడ్డిని మండల పరిధి పోచారం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇంద్రాసేనారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్, పవన్‌కుమార్, చంద్రశేఖర్, కరుణ, జమీర్, రమేష్, రవీందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వీడ్కోలు పలుకుతున్న యూనియన్ నేతలు, ఏఈ తదితరులు

యాదవుల సంస్కృతికి ప్రతీక సదర్



యాదవులతో పాండురంగారెడ్డి

తలకొండపల్లి: యాదవుల సంస్కృతికి ప్రతీక అయిన సదర్ ఉత్సవాలను రాజకీయ, కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని రియల్టర్ ఏమిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మండల పరిధి చుక్కాపూర్‌లో ఈ నెల 28న యాదవుల ఆధ్వర్యంలో సదర్ నిర్వహించనున్నారు. వేడుకల నిర్వహణకు.. పాండురంగారెడ్డి, ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శనివారం హైదరాబాద్‌లో రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

కందుకూరు: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకాలంలో సేవలందించాలని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను ఇవ్వాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వచ్చే నెల మొదటి వారంలో సంఘం ద్వారా ఏర్పాటు చేయనున్నామన్నారు. క్వింటాల్‌కు సన్న రకం రూ.2320తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌తో కలిపి రూ.2820 అందిస్తామన్నారు. దొడ్డు రకానికి రూ.2300 చొప్పున సేకరించనున్నామన్నారు. అనంతరం నూతన హెచ్‌డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్‌ను సన్మానించారు.

రెవెన్యూలో అక్రమాలు?

రికార్డుల్లో భూమి మాయం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితురాలి ఆందోళన
- విచారణ చేసి న్యాయం చేస్తాం: తహసీల్దార్ వెంకట ప్రసాద్

మంచాల: రెవెన్యూ అధికారుల అక్రమాలు రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నాడు భూ వివరాలు తెలుసుకోవడానికి ఏడాదికి ఒకసారి రికార్డులను చూసుకునేవారు. కానీ నేడు నిత్యం పరిశీలించుకోవాల్సిన దుస్థితి కలిగింది. విక్రయించక పోయినా రికార్డుల్లోంచి భూమి ఎప్పుడు మాయం అవుతుందో తెలియని పరిస్థితి మంచాల తహసీల్దార్ కార్యాలయంలో నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి బండలేమూర్ గ్రామానికి చెందిన కొట్టం యాదమ్మ అనే మహిళా రైతుకు 903/అ సర్వే నంబర్‌లో 2-26 ఎకరాలు, 906/అ సర్వే నంబర్‌లో 6-14 ఎకరాల భూమి ఉంది. మొత్తం 9 ఎకరాల భూమి.. వారి తల్లిదండ్రుల కాలం నుంచి సాగుచేసుకుంటున్నారు.

3-29 ఎకరాలు బదలాయింపు

1962 నుంచి కాస్తులో, 1995 నుంచి రికార్డులో ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెల వరకు రికార్డులో ఏమాత్రం మార్పు లేదు. రెండు రోజుల క్రితం రికార్డులను పరిశీలించగా.. 903/అ సర్వే నంబర్‌లో 2-26 ఎకరాలకు బదులు 2-08 కట్‌చేసి కేవలం 0-18 గుంటలు మాత్రమే రికార్డుల్లో ఉంది. 906/అ సర్వే నంబర్‌లో 6-14 ఎకరాలకు 1-21 ఎకరాలు కట్ చేసి కేవలం 4-33 ఎకరాలు మాత్రమే ఉంది. ఇలా ఉన్నదాంట్లో ఒక్కసారిగా 3-29 ఎకరాలు తగ్గడంతో బాధిత రైతు కుటుంబం శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. అక్కడి రికార్డులను పరిశీలించగా.. వారి భూమి నుంచి 3-29 ఎకరాలను తొలగించి, పక్క రైతు ఇస్లావత్ సీతారాం కుటుంబ సభ్యులు ఇస్లావత్ అనిత, చంది, వనిత, సోనాల పేరు మీదకు మార్పిడి చేసినట్లుగా గుర్తించారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాస్‌బుక్ చూపిస్తున్న బాధిత మహిళా రైతు యాదమ్మ

ఆత్మహత్య చేసుకుంటాం..

మా ప్రమేయం లేకుండా.. మా భూమిని వేరే వారి పేరిట ఎలా మారుస్తారని బాధిత రైతు కుటుంబ రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. మా పేరిట ఉన్న భూ రికార్డులను మార్చడం అన్యాయం అని పేర్కొన్నారు. అధికారులు సైతం ఏ ఆధారం లేకుండా, కనీస సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పట్టా మార్పిడి ఎలా చేస్తారని ప్రశ్నించారు. మా భూమిని మా పేరిట రికార్డుల్లో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే విషయంపై తహసీల్దార్ వెంకట ప్రసాద్‌ను వివరణ కోరగా.. ధరణి పోర్టల్ ద్వారా తప్పులు దొర్లుతున్నాయని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



ప్రభుత్వం జారీ చేసిన పాత, కొత్త పట్టా పాసు పుస్తకాలు

అన్యాయం చేశారు

పక్క రైతుల నుంచి తహసీల్దార్ రూ.లక్షలు లంచం తీసుకుని మాకు అన్యాయం చేశాడు. తమకు వారసత్వంగా వస్తున్న భూమి. మా ప్రాణాలు పోయినా వదిలి పెట్టం. అక్రమంగా ఎలా పట్టా మార్పిడి చేశారో చెప్పాలి. అవసరమైతే ఇక్కడే ప్రాణాలు తీసుకుంటాం.

– కొట్టం యాదమ్మ, రైతు, బండలేమూర్